క్లుప్తంగా

శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

భువనగిరి రూరల్ : మండలంలోని హన్మాపురం గ్రామంలో శ్రీకృష్ణాష్టమి ముగింపు ఉత్సవాల్లో భాగంగా శనివారం త్రైతసిద్ధాంత ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు బుచ్చిబాబు, దేవేంద్ర, ధనలక్ష్మి, జయమ్మ, శ్రీసార్వారి, సాయికుమార్, రాజశేఖర్, నారాయణ, బాలమ్మ, కృష్ణ, వెంకటేశ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

4న మెగా రక్తదాన శిబిరం

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలో ఈనెల 4న పోతాయిగడ్డ ప్రాంతంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, టీఎస్‌యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ అధ్యక్షుడు ఓ.సత్యనాథ్, కార్యదర్శి మెట్టు మంగేష్, ఎ.సత్తయ్య, డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంపీ, ఎమ్మెల్సీని కలిసిన వెంకటాపురం గ్రామస్తులు



ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వెంకటాపురం గ్రామస్తులు

వలిగొండ. : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు సమస్యలను వివరించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కలిసిన వారిలో కొత్త వెంకటేశం, జక్కల రోశయ్య, కొత్త ఈరయ్య, జక్కల శ్రీశైలం ఉన్నారు.

రేఖల శ్రీనివాస్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం 132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్టిజెన్ ఉద్యోగిగా పనిచేసి శనివారం ఉద్యోగ విరమణ పొందిన రేఖల శ్రీనివాస్‌ను తోటి ఉద్యోగులు స్థానికంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎస్పీ హరిప్రసాద్, డీఈ నర్సయ్య పాల్గొని మాట్లాడారు. రేఖల శ్రీనివాస్ ఉద్యోగ నిర్వహణలో ఎంతో క్రమశిక్షణగా, అంకిత భావంతో పనిచేశారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏడీఈ రాంప్రసాద్, ఏఈఈలు సుగుణ, తుకారామ్, వర్దన్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



జోగు రవీందర్

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని అభినవ యూత్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జోగు రవీందర్, ఉపాధ్యక్షుడిగా సుంకి సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా వేముల నరేశ్, కోశాధికారిగా వల్లాల బాలరాజు, సహాయ కార్యదర్శిగా మహేశ్వరం ప్రసాద్, సహాయ కోశాధికారిగా కొయ్యడ లింగస్వామి, క్రీడల కార్యదర్శులుగా గుజ్జ పద్మరుషి, సిద్దుల ప్రభాకర్, సాంస్కృతిక కార్యదర్శులుగా గుండు శ్రీధర్, బిజ్జ బాలకృష్ణ, సభ్యులుగా వర్కాల గణేశ్‌కుమార్, గంజి నర్సింహ, విడెం పవన్‌కుమార్, గుమ్మడి రమేశ్, రచ్చ శేఖర్, జోగు లక్ష్మీనారాయణ, గంజి చంద్రశేఖర్, కారంపూడి బాలాజీ ఎన్నికయ్యారు.

ఘనంగా బోనాల పండుగ



బొమ్మలరామారం : బోనాలతో మహిళలు

బొమ్మలరామారం : మండలంలోని మైలారం గ్రామంలో శనివారం బీరప్పస్వామి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డోలు చప్పుళ్లతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పెద్దకురుమ బుడుమ శ్రీశైలం, అయిలయ్య, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కాటమయ్యకు బోనాలు

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని ఆరెగూడెం గ్రామంలో శనివారం కాటమయ్య బోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి కాటమయ్యకు సమర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బద్దం మల్లేష్, నాయకులు కృష్ణ, రాములు, నరేష్, లింగస్వామి, సురేష్, వినోద్, వెంకటేష్, శ్రీకాంత్ ఉన్నారు.

రైతు వేదికలో వసతులు కరువు

- అసంపూర్తిగా టాయిలెట్స్ నిర్మాణ పనులు
- ఇబ్బందులు పడుతున్న అధికారులు



పాటిమట్ల రైతు వేదిక



టాయిలెట్స్‌కు బిగించని తలుపులు

మోత్కూరు : మోత్కూరు మండలంలోని పాటిమట్ల క్లస్టర్ రైతు వేదికలో మౌలిక వసతులు కరువయ్యాయి. గత ప్రభుత్వం మండలంలోని అనాజిపురం, దత్తప్పగూడెం, పాటిమట్ల క్లస్టర్ గ్రామాల్లో రైతు వేదికలు నిర్మించింది. ఒక్కో క్లస్టర్ రైతు వేదిక నిర్మాణానికి రూ.22 లక్షలు వెచ్చించింది. అన్ని రకాల సదుపాయాలతో రైతు వేదికలో నిర్మించాలన్నది అప్పటి ప్రభుత్వ ఉద్దేశం. అధికారుల పర్యవేక్షణ లోపంతో రైతు వేదికలో అసంపూర్తి పనులతో కాంట్రాక్టర్ వదిలేశాడు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతి మంగళవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుంది. ఈ రైతు వేదికలో టాయిలెట్స్ పనులు అసంపూర్తిగా వదిలేశారు. తలుపులు బిగించ లేదు. మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇచ్చారు. వాటర్ ట్యాంకు ఏర్పాటు చేయలేదు. మండల స్థాయిలో పాటిమట్ల రైతు వేదికలోనే వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడికి వచ్చే మహిళా రైతులు, మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళా అధికారుల బాధలు వర్ణనాతీతం. ప్రతి మంగళవారం జరిగే వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యే మహిళలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కరెంటు లైన్ అస్తవ్యస్తంగా ఏర్పాటు చేశారు. వరండాకు సిమెంటు ఫ్లోరింగ్ చేయలేదు. కిటికీలకు మెష్ (జాలి), అద్దాలు బిగించ లేదు. చాంబర్‌కు పైన సజ్జా వేయక పోవడంతో వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసేందుకు అనుకూలంగా లేదు. రైతు వేదికలో వసతులు కల్పించాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



పాటిమట్ల రైతువేదికలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. అసంపూర్తిగా ఉన్న మూత్రశాల, మరుగుదొడ్డి పనులను పూర్తి చేయించాలి. ప్రభుత్వం ప్రతి మంగళవారం నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యే మహిళా రైతులు, అధికారులు రైతువేదికలో మౌలిక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

– బండ స్వరూప, మహిళా రైతు

అసంపూర్తి పనులు పూర్తి చేయించాలి



రైతు వేదికలో అసంపూర్తిగా చేసిన పనులను తక్షణమే పూర్తి చేయించాలి. రైతు వేదిక వద్ద సిమెంటు ఫ్లోరింగ్ చేయించాలి. రైతు వేదిక భవన కిటికీలకు అద్దాలు, తలుపులు బిగించాలి. అదేవిధంగా తాగునీటి సౌకర్యం కల్పించాలి. రైతు వేదికలకు వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలి. వాటి నిర్వహణకు నిధులు కేటాయించాలి.

– గిరగాని శ్రీను, రైతు

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ మనోహర్

మోత్కూరు : ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అడిషనల్ జిల్లా పబ్లిక్ హెల్త్ అధికారి డాక్టర్ మనోహర్ సూచించారు. శనివారం మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పలు రకాల రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రధానంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డాక్టర్లు ఎం.హేమంత్‌కుమార్, అమరావతి, కమిటీ హెల్త్ ఆఫీసర్ దేవకి, పబ్లిక్ హెల్త్‌నర్స్ సవిత, సూపర్‌వైజర్లు ఊర్మిళ, ల్యాబ్ టెక్నీషియన్ జనార్దన్, స్టాఫ్‌నర్సు ఉన్నారు.

40కిలోమీటర్ల నిబంధన పాటించాలి



సమావేశంలో పాల్గొన్న పాలకవర్గ సభ్యులు

చౌటుప్పల్ : హైదరాబాద్‌కు చుట్టూ ఇప్పటికే ఉన్న ఓఆర్‌ఆర్‌కు ప్రతిపాదిత ట్రిపుల్‌ఆర్‌కు నడుమ 40కి.మీ దూరం ఉండాలన్న నిబంధన పాటించాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు డిమాండ్ చేశారు. నిబంధన పాటించకపోవడంతో చౌటుప్పల్ పట్టణ అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపనుందన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ట్రిపుల్‌ఆర్ బాధితులకు బహిరంగ మార్కెట్ ధర పరిహారంగా చెల్లించాలని, 40కి.మీ దూరం నిబంధన పాటించాలని ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిబంధనను ఉల్లంఘించి 28కి.మీ దగ్గరనే ట్రిపుల్‌ఆర్‌ను ఏర్పాటు చేయడం పెద్ద కుట్ర అన్నారు. దీంతో పట్టణం రెండుగా విడిపోయే ప్రమాదం ఉందన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ద్వారా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సమావేశంలో కమిషనర్ వెంకటేశ్వరనాయక్, వైస్‌చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి



బొమ్మలరామారం : సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి

బొమ్మలరామారం : అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్‌లు, ఆయాలు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి అన్నారు. మండలంలోని చీకటిమామిడి గ్రామంలోని అంగన్‌వాడీ సెక్టార్ సమావేశంలో శనివారం ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి రోజు గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. మూడు సంవత్సరాలలోపు పిల్లలకు టేక్ హోమ్ రేషన్‌గుడ్లు ఇచ్చే సమయంలో నాణ్యతను పరిశీలించాలన్నారు. అనంతరం కంచల్‌తండా, నాయకునితండాల అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి మొక్కలు నాటా రు. కార్యక్రమంలో సీడీపీఓ శైలజ, సూపర్‌వైజర్లు నర్మద, ఊర్మిళ, పోషణ్‌అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ హర్ష, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

భువనగిరి రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రతిరోజు పోషకాహార పదార్థాలను పరిశీలించుకోవాలని, ఎక్స్‌పైరీ దాటనవి ఉంటే శుభ్రం చేసుకుని భద్రపర్చుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి అన్నారు. శనివారం మండలంలోని బొల్లెపల్లి సెక్టార్‌లోని నందనం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. సెప్టెంబర్1 నుంచి 30వరకు పోషణ మాసం కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ శైలజ, సూపర్‌వైజర్ నర్మద, పూర్ణిమ, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ రజాక్, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ హర్ష, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ఆదర్శంగా ఉండాలి



భువనగిరి : సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఏలే చంద్రశేఖర్

భువనగిరి : బీజేపీ సభ్యత్వ నమోదులో పట్టణం రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఏలే చంద్రశేఖర్ అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో పార్టీకి చెందిన కౌన్సిలర్లు ప్రత్యేక చొరవ తీసుకుని సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలన్నారు. పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు రత్నపురం బలరాం అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ ఉమాశంకర్‌రావు, నాయకులు సుర్వి లావణ్య, సత్యవతి, కౌన్సిలర్లు బొర్ర రాకేష్, ఉదయగిరి విజయ్, నల్లమాస సుమ, ఊదరి లక్ష్మి, జనగాం కవిత, నాయకులు కృష్ణచారి, నగేష్, సంతోష్, వెంకటేష్, కపిల్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



రాజాపేట : కరుణకుమారి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాజాపేట : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న కె.కరుణకుమారి ఉద్యోగ విరమణ సన్మాన సభను శనివారం పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం, మిత్రులు, బంధువులు, ఉద్యోగ సంఘాల బాధ్యులు ఆమెను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సెక్రోరియల్ ఆఫీసర్ పెసరు లింగారెడ్డి, నోడల్ ఆఫీసర్ చందా రమేష్, రిటైర్డ్ ఎంఈఓ బల్ల దామోదర్, హెచ్‌ఎం సట్లు జయంత, పాఠశాల చైర్మన్ రేణుక, ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సత్తయ్యకు ఘన సన్మానం

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మోటె సత్తయ్య ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా శనివారం పీఆర్‌టీయూ–టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, హెచ్‌ఎం భార్గవి, ప్రతినిధులు ఇన్నారెడ్డి, రాంమోహన్‌రావు, నర్సింహారెడ్డి, కృష్ణమూర్తి, సురేందర్‌రెడ్డి, చలపతిరెడ్డి, విజయానంద్, అమరేందర్‌రెడ్డి, కెఆర్.మాధవరెడ్డి, యాదయ్య, బిక్కు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి శతకం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణమోహన్‌రావు

భువనగిరి : డాక్టర్ నారాయణ రచించిన వేంకటేశ్వరస్వామి శతకాన్ని ఆదివారం భువనగిరిలోని స్వర్ణగిరి క్షేత్రంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీ రాగ రమ్యకల్చరల్, సోషల్ యాక్టివిటీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య, సంగీత కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులు వెంకటేశ్వర స్వామి వేషధారణతో ఆకట్టుకున్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం నిత్యారాధనలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ చేపట్టిన అనంతరం స్వామి, అమ్మవారికి నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ఆ తరువాత భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. ఇక ఆలయ ముఖ మండపంలో తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం స్వామి,అమ్మవారికి జోడు సేవలను ఆలయ మాఢవీధిలో ఊరేగించారు. రాత్రి శయనోత్సవం జరిపించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

పౌరహక్కుల దినోత్సవం

గుండాల : మండలంలోని వంగాల గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా దళితులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై వివరించారు. దళిత వాడలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఆర్‌ఐ నరేష్, ఏఎస్‌ఐ శ్రీనివాస్, పోలీసులు సైదులు, నరేష్, ప్రశాంత్, అంగన్‌వాడీ టీచర్ శ్యామల, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొనాల్సి ఉన్నా రెవెన్యూ కింది స్థాయి అధికారి మాత్రమే పాల్గొన్నారు. దీంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని గ్రామస్తులు వాపోయారు.

మోటకొండూర్ : మండలంలోని వర్టూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆర్‌ఐ ధరావత్ నరేష్ పాల్గొని మాట్లాడారు. గ్రామస్తులకు రాజ్యాంగంలో కల్పించిన పౌరహక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆనంద్, సురపంగ శివలింగం, పల్లె శ్రీహరి, రాములు, నరేష్ తదితరులు ఉన్నారు.

పనులు వేగంగా పూర్తిచేయించాలి

చౌటుప్పల్ : పట్టణంలోని గాంధీపార్క్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయించాలని మున్సిపల్ కౌన్సిలర్ తాడూరి శిరీషపరమేష్ కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజుకు వినతిపత్రం అందజేశారు. అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే నిలిపివేసినందున ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

రైతులు వివరాలు నమోదు చేయించుకోవాలి



వలిగొండ : గోకారంలో రైతు కుటుంబ నిర్ధారణను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్



బొమ్మలరామారం : దరఖాస్తులను పరిశీలిస్తున్న ఏడీఓ శాంతి నిర్మల

రామన్నపేట : రేషన్‌కార్డు లేని కారణంతో రుణమాఫీ నిలిచిపోయిన రైతులు విధిగా తమ కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ తెలిపారు. శనివారం మండలంలోని నీర్నెముల గ్రామంలో చేపట్టిన రైతుల వివరాల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి రైతు వివరాల నమోదుపై ఆరా తీశారు. దరఖాస్తు ఫారంతో పాటు కుటుంబ సభ్యుల ఆధార్ జిరాక్స్ ప్రతులను జతచేసి మండల వ్యవసాయ అధికారితో సెల్ఫీ దిగాలన్నారు. రుణమాఫీకి సంబంధించిన సందేహాలను మండల నోడల్ అధికారిని కలిసి తెలుసుకోవాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి ఎజాజ్ అలీఖాన్, విస్తరణాధికారులు ఎం.శ్రీనివాస్, పి.శ్రీనివాస్, ఎం.కిరణ్, రైతులు తదితరులు ఉన్నారు.

వలిగొండ : మండలంలోని గోకారంలో రైతు వేదికలో శనివారం రుణమాఫీ రాని రైతు కుటుంబాల నిర్ధారణ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అంజనీదేవి, ఏఈఓలు నవిత, భగీరథ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని నర్సాపురంలో రుణమాఫీ కాని రైతుల వివరాలను వ్యవసాయ అధికారులు శనివారం సేకరించారు. ఈ సందర్భంగా ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్ బ్యాంకు ఖాతాలకు అనుసంధానం కాకపోవడం, ఆధార్, బ్యాంకు ఖాతాల్లో పేర్ల వివరాలు తేడా ఉండటం వంటి అంశాలను గుర్తిస్తూ ఆన్‌లైన్‌లో రైతుల వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రణీత, రైతులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : రైతు రుణమాఫీకాని రైతులు తమ వివరాలను రైతు వేదికలో అందించాలని ఏడీఏ శాంతి నిర్మల తెలిపారు. శనివారం మండలంలోని మల్యాల, బొమ్మలరామారం క్లస్టర్‌లోని రైతు వేదికలో వివరాల నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఓ దుర్గేశ్వరి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోలీస్ అధికారిపై చర్య తీసుకోవాలి

భువనగిరిటౌన్ : దళిత ఎమ్మెల్యే వేముల వీరేశంను అవమానపరిచిన పోలీస్ అధికారిపై చర్యలు తీసుకోవాలని శనివారం పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్‌మాదిగ, రాజేష్, హరిప్రసాద్ ఉన్నారు.

బెల్టు దుకాణాల్లో తనిఖీలు

చౌటుప్పల్/చౌటుప్పల్ రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం, అంకిరెడ్డిగూడెం గ్రామంలో శనివారం బెల్టుదుకాణంలో తనిఖీ నిర్వహించారు. లింగోజిగూడెం గ్రామానికి చెందిన పోలోపల్లి భాస్కర్ కిరాణం దుకాణంలో 12బీర్లు, రెండు కాటన్ల ఫుల్‌బాటిళ్లు, రెండు హాఫ్ బాటిళ్లు చొప్పున 10లీటర్ల మద్యాన్ని, అంకిరెడ్డిగూడెం గ్రామంలో వల్లందాసు వెంకటేష్ నిర్వహిస్తున్న హోటల్‌లో పోలీసులు తనిఖీ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ మన్మథకుమార్ తెలిపారు.

నిధులు మంజూరు చేయాలి

గుండాల : నవాబుపేట రిజర్వాయర్ కాల్వల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని, పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయకుండా పనులు ఎలా పూర్తి చేస్తారని సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

రామన్నపేట : మండలంలో గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించే భక్తులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఐ పి.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారానికి, ఆర్గనైజర్ ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతిని జతచేసి పోలీస్‌స్టేషన్‌లో సమర్పించాలని సూచించారు.

కల్వర్టు పరిశీలించిన ఆర్‌అండ్‌బీ డీఈ

ఆత్మకూరు(ఎం) : మండలంలోని రాఘవాపురం–కూరెల్ల గ్రామాల మధ్య శిథిలావస్థకు చేరిన కల్వర్టును ఆర్‌అండ్‌బీ డీఈ సురేందర్ శనివారం పరిశీలించారు. అనంతరం తుక్కాపురం–రహీంఖాన్‌పేట గ్రామాల మధ్య అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. కల్వర్టు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న బీటీరోడ్డు పనులు పూర్తి చేయిస్తానని తెలిపారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ ఏఈ ఎం.స్వామి తదితరులు ఉన్నారు.

బస్వాపురం నుంచి సాగునీరు అందించాలి

భువనగిరి రూరల్ : బస్వాపురం ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేసి సాగునీరు అందించాలని, నిర్వాసితులకు వెంటనే డబ్బులు చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, కార్యదర్శివర్గ సభ్యులు పల్లెర్ల అంజయ్య, కొండమడుగు నాగమణి, ఏదునూరి మల్లేశం, అశోక్, ఎల్లయ్య, మైసయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆలేరురూరల్ : సీజనల్ వ్యాధులపై ప్రజలు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పలు పనులకు సంబంధించి తీర్మాణాలు ప్రవేశపెట్టి ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.లక్ష్మి, మేనేజర్ శారద, కౌన్సిలర్లు, బేతి రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వీడ్కోలు సమావేశం

అడ్డగూడూరు : మండలంలోని జానకిపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు పాఠశాలలో శనివారం వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కూరాకుల రవీందర్, ననుబోతు అనిత, సమ్మయ్య, ఉపాధ్యాయులు ఎస్.యాదగిరి, హకీమ్, రమేష్, శ్రీధర్, గ్రామస్తులు విద్యాసాగర్, రవి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీజీవీ బ్యాంక్‌కు పీవీ పేరుపెట్టాలి

ఆత్మకూరు(ఎం) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏపీజీవీ బ్యాంక్‌లకు దివంగత మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహరావు పేరు పెట్టాలని తెలంగాణ విద్యావంతుల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ జెట్ట శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఏపీ పేరు మీద బ్యాంక్‌లు ఉండడం విచారకరమన్నారు. అధికారులు స్పందించి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ బదులుగా తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్‌గా నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జెట్ట రవి, నాతి అంజయ్య, జెట్ట లింగయ్య, జెట్ట శ్రీశైలం, కప్పె విఠల్, కుమ్మరికుంట్ల ఆగయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సహకారం

రాజాపేట : మండల కేంద్రానికి చెందిన నిరుపేద కోయ మల్లికార్జున్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం దాతలు, మిత్రుల సహకారంతో గ్రామస్తులు రూ.45వేల 900 నగదు బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు.

కళాకారులకు రూ.5వేల ఫించన్ ఇవ్వాలి

ఆత్మకూరు(ఎం) : గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న కళాకారులకు రూ.5వేల ఫించన్ ఇవ్వాలని తెలంగాణ ప్రజానాట్య మండలి ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన గ్రామీణ కళాకారుల జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలలో కోలాటం కళాకారులకు అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో కళాకారులు సరిత, లక్ష్మి, శ్రావణి, భాగ్యమ్మ, జ్యోతి, పార్వతమ్మ, భాగ్యమ్మ, అందాలు పాల్గొన్నారు.

వర్షానికి రోడ్లు జలమయం.. నేలకొరిగిన చెట్లు



భువనగిరిలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రవహిస్తున్న వరద నీరు



భూదాన్‌పోచంపల్లి : హస్తినాపురం కాలనీలో ఇళ్ల మధ్య చేరిన నీరు



భువనగిరిలో చిన్నారితో వర్షంలో తడుస్తూ వెళ్తున్న మహిళ



రాజాపేట : ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్టు



అడ్డగూడూరు : చౌల్లరామారంలో విరిగిన విద్యుత్ స్తంభం



అడ్డగూడూరు : అడ్డగూడూరు-పాటిమట్ల వెళ్లే ప్రధాన రోడ్డుపై విరిగిపడిన చెట్టు